# దేవుడు బ్రతికిపోయాడు

మూడురోజులు గాజరుగుతున్న కల్యాణోత్సవాల అనంతరం, తన కల్యాణ శోభను నలుగురి ముందూ వీధిలో ప్రదర్శించాలనుకున్నట్టు రథంమీద చేరాడు — సతీసమేతంగా.

రథం బయలుదేరింది. రథం ముందుగా ఏదో బ్యాండు మేళం మోగుతోంది—ఒక సన్నాయి మేళం కూడా ఉంది. ఆ సన్నాయి కృతుల్ని తప్ప సినిమా పాటల్ని నేర్చుకోలేదు. సినిమా పాటల్నే తప్ప 'కృతుల్ని' వినలేని యువతరం చెవులు కొన్ని ఆటంకం చెప్పటంతో, అధికారాల గొంతులు గర్జిస్తే సన్నాయి నోరు మూసుకుంది. బ్యాండు మేళం ఉత్సాహాన్ని పుంజుకొంది. బ్యాండు మేళానికి 'తిక్కరేగి తిమ్మిరెక్కింది కుర్రాళ్ళని ''లేలే నా రాజా' అంటూ లేపుతోంది. కుర్రాళ్ళలో ఉత్సాహం విజృంభించింది. చప్పట్లు కొడుతున్నారు. కలిసి పాడుతున్నారు. ఆడుతున్నారు, కేక లేస్తున్నారు, గంతులేస్తున్నారు. రథంలోని దేవుడికీ, దేవుడిఆలయానికీ ధర్మకర్త అయి. కనకాచలం నాయుడు గారు కుర్రాళ్ళ 'భక్తి'నిచూసి పరవశించిపోతున్నారు. వూరేగింపు కన్నా, వూరేగే దేవుడి కన్నా, ముందు సాగే బ్యాండు మేళం కన్నా రథం వెనుక సాగి వస్తున్న అమ్మాయిల వోరచూపులు వాళ్ళకి 'ఇన్స్పిరేషన్' ఇస్తున్నాయని నాయుడు గారికి తెలీదు. బ్యాండు వాళ్ళకీ తెలీదు. ఆ దేవుడికీ తెలీదు. దేవుడు రథం ముందు బాణా సంచా కాలుతోంది. తారాజువ్వలు ఎగిరి తమ కృత్రిమమైన రంగుపూలని తాత్కాలికంగా వెలుగు రీసుతూ వెద జల్లుతున్నాయి. ఆరిపోయిన తరవాత పేచ్చేరసాయనాల దుర్గంధం అక్కడి కుహనా భక్తుల అంతరంగ పరిమళంలా వ్యాపిస్తోంది.

* * *

"వేవేగ రావయ్య వేణుగోపాలా!
రథం మీద రావయ్య రాధాగోపాలా!"

బ్యాండు మేళాల ధ్వనిని కూడా వెనక్కినెట్టుతూ ఒక ఉచ్ఛస్వరం రాగయుక్తంగా రథానికి అభిముఖంగా వస్తోంది. ధ్వని మాత్రమే వినపడుతుంది పాడుతున్న వ్యక్తి మనిషిలా లేడు. ఎముకల గూడు మీద చర్మం కప్పినట్టున్నాడు. కళ్ళు లోతుగా గోతుల్లా ఉన్నాయి. గాలిలో తేలి వస్తున్న శవంలా ఉన్నాడు. వచ్చిన వాడల్లా సర్వశక్తులూ కోల్పోయిన వాడిలా రథం ముందు సాగిలబడిపోయాడు. "స్వామీ! మళ్ళీ ఎన్నాళ్ళకయ్యా నా కనులారా చూశాను. జన్మ ధన్యమయిందయ్యా! నీ కల్యాణ వైభవాన్ని ఎంతని స్తుతించను? ఏమనిస్తవించను? ఇన్నాళ్ళకు మళ్ళీ దర్శనమిచ్చావయ్యా! ఈ విరహాగ్ని చూశావా నల్లనయ్యా! నీ దర్శనంతో ఎలా చల్లారిపోతోందో?..." అతను ఏదో తన్మయావస్థలో ఏదేదో మాట్లాడుతున్నాడు మాట్లాడేటప్పుడు అతని కళ్ళల్లో తేజస్సు వాట్య మాడుతూంది. అతనింకా ఆ అవస్థలోనే ఉన్నాడు. మాట్లాడుతున్నాడు.

"పిచ్చివాడు... బయటకు ఈడ్చేసెయ్యండి" ఒక కఠినమైన బొంగురుగొంతుసలహా. రథాన్ని లాగే చేతులు తమ పని మానేసి తమ బలాన్ని ఆ వృద్ధ శరీరం మీద చూపించసాగేయి. అతను విడిచి పెట్టటం లేదు. రథ చక్రాన్ని పట్టుకుని విలపిస్తున్నాడు.

"స్వామీ! మళ్ళీ సంవత్సరం ఈ విరహాన్ని అనుభవించలేను. నన్ను శాశ్వతంగా తీసుకుపో. నీ వెంట చేర్చుకో స్వామీ! ఈ పాప ప్రపంచంలోని అన్యాయాలూ, అక్రమాలూ చూస్తూ సహించలేక జీవచ్ఛవంలా ఉండటం కంటే నీ రథ చక్రం కింద నలిగి ధూళిలో కలిసి పోవటం మేలు. నన్ను నీ పాదాలతో పునీతం చెయ్యి స్వామీ!..." అతను ఏడుస్తుంటే అతని కన్నీళ్ళతో భూమి తడుస్తోంది,

అతన్ని ఈడ్చుతుంటే, అతని శరీరం తెలి



కారే రక్తంతో భూమి తడుస్తోంది

ఆతని మొర దేవుడు వినలేదు.... కాదు... బ్యాండు మేళం వాయించేసినిమా పాటల్లో లీనమైన దేవుడు చెవులకి — భక్తి ముసుగు వేసుకుని అప స్వరాలతో వేద మంత్రాలు పఠించే పురోహితుల కంఠస్వరాలు వినే దేవుడి చెవులకి భక్తుడి మొర వినపడలేదు.

మెర్క్యురీ వీధి దీపాల కాంతుల్నీ, కాలుతున్న మెగ్నీషియం వైర్ల కాంతుల్ని చూసి ఆనందిస్తున్న దేవుడి కళ్ళకి భక్తుడి కన్నీళ్ళు కనపడలేదు. రథం సాగి పోతోంది. రోడ్డు మీద మురికి కాలువ పక్క భక్తుడి శరీరం పొర్లాడుతూంది. అతను లేవబోతు న్నాడు. లేవలేక పోతున్నాడు. దూరాన బ్యాండు మేళం... బాణ సంచా కాలే ధ్వనులు అగరొత్తులు, మల్లెపూలు, తులసీ, అత్తరువుతో కలిసి వచ్చే గంధ కం రసాయనాల ఘాటు... అతన్ని ఏవో లోకాల్లో తీసికెళ్ళాయి. ఆతని గుండె బరువై పోయింది. కళ్ళు కాల్వలై పోయాయి. సంవత్సరం క్రితం... సరిగ్గా సంవత్సరం క్రితం... ఇదేరోజు...వైశాఖపూర్ణిమ... దేవుడి కల్యాణోత్సవం...

* * *

రామానుజాచారి హడావిడిగా తిరుగుతున్నాడు. దేవుడి కల్యాణం నిర్వహించే భారమంతా అతడి పైనే ఉంది. అహోరాత్రులూ అతడికి నిద్రలేదు. అతడికి. తెలిసిందల్లా తను... దేవుడు... కల్యాణం అతడికి ఇంటితో ప్రమేయం లేదు. ఇల్లు ఉన్నట్టే గుర్తు లేదు. వుూయల్లో అమాయికంగా రోదించే సంవత్స రం వయస్సు జీర్ణించుకున్న పసిపాపపై అతడి ధ్యాస లేదు.

మొదటి భార్య పోయిన ఎనిమిది మాసాలకి బంధు వుల బలవంతం వల్లా, పసికందు రక్షణ కోసం చేసుకున్న రెండో భార్య — ఇరవై 'వసంతాల' సౌభాగ్యలక్ష్మి గుర్తుకు రావటం లేదు.

సర్వాలంకార శోభితుడై రథం మీద వూరేగు తున్నప్పుడు, ప్రక్కనే వింజామర వీస్తూ వదు స్తూన్న రామానుజాచారికి బాహ్యలోకమే కనుపిం చటం లేదు. కనుపించని దివ్య లోకాల్లో ఆత్మాను భూతిని పొందుతున్నాడు.

మరో రెండు మూడు గంటల్లో ప్రకృతి చీకటి లరోచి వెలుతురులోకి రంగు మార్చుకొనే సమయం. రామానుజాచారి ఇంటికెళ్ళి తలుపుతట్టాడు. తలుపు తెరుచుకుంది. ఆ తెరుచుకోవటంలో ఒకరు తెరిచిన స్పర్శ అనుభవించలేదు. ఆచారి అందుకే—

"సౌభాగ్యం!" పిలిచాడు చీకటి ప్రతిధ్వనిం చింది.

మరో మారు పిలిచాడు—మామూలే!

ఉలుకు లేదు, పలుకు లేదు.

చీకట్లో తడుముకుటూ పోయాడు. గూట్లో అగ్గిపెట్టి తీసి దీపం వెలిగించాడు.

ఆ గుడ్డి దీపం వెలుతురులో కలయజూసిన అతనికి...ఆరిపోయిన మరో 'దీపం' కనుపించింది.

ఆ దీపం వ్రేలాడుతోంది ఇంటి మధ్యలో —

ఆ దీపంలో తైలం లేదు, ఒత్తి లేదు.

కేవలం ప్రమిదే వ్రేలాడుతోంది. ఆ ప్రమి ద— అదే 'సౌభాగ్యం'.. సౌభాగ్యలక్ష్మి.

"సౌభాగ్యం" వెర్రిగా అరిచాడు ఆచారి.

అతని అరుపుకి వూయలలోని పాప 'కెవ్వు' మంది.

"ఎందుకలా చేశావు?" అతను ప్రశ్నించటం లేదు.

వేదన నిండిన గుండెకు మాట్లాడే శక్తి లేక మౌనంగా ప్రశ్నిస్తోంది జవాబు కోసం చుట్టూ చూశాడు.

గుక్కపట్టి ఏడుస్తున్న పాప ఏడుపే జవాబుగా. ఉంది.

ఆతని కన్నీటి పొరల మధ్య — పక్కే మంచం, మంచం మీద నలిగిన పూలూ, విరిగిన గాజులూ, చినిగిన రవిక ముక్కలూ అస్తవ్యస్తంగా—మసక మసగ్గా కనిపించాయి.

అతను కళ్ళొత్తుకున్నాడు—వణికిపోతున్నాడు— మంచాన్ని సమీపించాడు.

"ఎవరు చేశారీ దుర్మార్గం?" మంచం కోడుతో తల ప్రశ్నిస్తోంది. రక్తం కంటి మీదుగా జాలువారి నోట్లోకి ప్రవహిస్తోంది. మంచం మధ్యగా వో విరి గిన చేతి గాజును కావరించుకొని వో కాగితం రెపరెలాడుతూంది. రామానుజం కాగితం విప్పాడు. మసక వెలుతుర్లో కన్నీటి మసక దృష్టితో ఒక్కొక్క అక్షరం వెనుకా సాగుతున్నాడు.

కామాంధకారంలో మునిగిన వేడిరక్తం కాలనాగై పగబట్టి, బుసకొట్టి కాటేసిన తరవాత భరించలేని పునీత సతీత్వం ఆత్మాభిమానంతో ఆత్మాహుతి చేసుకునే ముందు తెలిపిన వివరం, పిచ్చివాడి నడకలా, జీవంలేని శరీరంతో కాగితం మీద ప్రాణం పోసు కుంది.

రామానుజం కళ్ళల్లో రక్తం సెగలు కక్కింది.

శరీరంలో రక్తం పొగలు చిమ్మింది.

చైతన్యం కోపంగా మేలుకొంది.

"నాగరాజా!" రామానుజాచారి గొంతులో ఆవేశం ఆవేదన — ఆందోళన సమ్మిళితమై కొత్తగా రూప


లైట్ రూఫ్



ఆస్బెస్టాస్ రేకులు

కొళ్ళఫారముల కొక ప్రత్యేకత
మన్నికలో పేరెన్నిక గన్నవి

విదేశ సాంకేతిక సహకారముతో తయారగుచున్నవి.
విదేశములకుగూడ ఎగుమతి చేయబడుచున్నవి.

ఉత్పత్తిదారులు :
లైట్ రూఫింగ్స్ లిమిటెడ్,
226 - లాయడ్స్ రోడ్,
మద్రాసు-600 086.
ఫోన్ నెం: 810725/6/7

సోల్ డిస్ట్రిబ్యూటర్లు :
(ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,
ఒరిస్సా రాష్ట్రములకు)
బాలాజి & కంపెనీ
పెద్దిభొట్లవారి వీధి,
గవర్నరుపేట, విజయవాడ-2.
ఫోన్ నెం: 74979 & 72484

కల్పన చేసుకున్నాయి.

* * *

ఆదే సమయంలో 'నాగరాజా' అని పిలువబడే కనకాచలం నాయుడు గారి ఏకైక కుమార రత్నం గెస్టుహౌస్‌లో, నీలం రంగు బెడ్ బల్బు కాంతిలో —తన దుర్మార్గం గుండెల్ని సుతిమెత్తని పరుపు కానించి, అనుభవించిన సుఖాన్ని అనుభూతిగా మళ్ళీ అనుభవిస్తూ, నిద్రలో సుఖిస్తున్నాడు. రామానుజాచారి కేక అతనికి నిద్రలో లీలగా వినిపించింది. పీడకలలా అనిపించింది. లేచి చూసే సరికి అతడి నిద్ర కళ్ళకి రామానుజాచారి కళ్ళల్లోని కోపం మండి, ఆ మంటను తన మీదకి ప్రసరిస్తున్నట్టు ఆ మంటల్లో తను మన్మథుడిల్లా భస్మమై పోతున్నట్టు 'ఫీలయి' చేసిన నేరం గుండెల్ని కాళ్ళని వణికిస్తుంటే తడబడి లేచి నిల్చున్నాడు.

"ఆచారిగారూ!" భయం ఆశ్చర్యం గొంతులో వణుకుతున్నాయి. ఆవేశంలో ఉన్న రామానుజాచారి చేతులు నాగరాజుని ఏం చేస్తున్నాయో తెలీలేదు. ఆవేశం నుంచి తేరుకున్న రామానుజాచారి తెలుసుకున్నది ఏవిటి అంటే నాగరాజుకి స్పృహ తప్పిందని.

* * *

తెల్లవారింది పూరు గుప్పుమంది. చెవులూ నోళ్ళూ సంభాషించుకుంటున్నాయి. పంచాయతీ కూర్చుంది. కనకాచలం నాయుడు గారు అధికారి.

పంచాయితీ కూర్చోవటానికి నీడ నిస్తున్నచెట్టు 'అన్యాయం పాలు' పోసి పెంచబడింది. వారు కూచున్న మంటపం అన్యాయాలని ఎదిరించలేక స్థాణువై పోయిన న్యాయసింహాసనంలా ఉంది.

పంచాయతీలో నాయుడుగారు మాట్లాట్టం లేదు. ఆతని అనుచరులు మాట్లాడుతున్నారు. అతను మాత్రం — తన కోపాన్ని అణచుకోలేక శపిస్తే ప్రపంచం భస్మమై పోతుందని యోచించి మౌనం, పోర్పూ వహించిన "ఋషి'లా తలందిచుకు కూచున్నాడు.

పంచాయతీలో నాగరాజా సౌభాగ్యలక్ష్మికి చేసిన అత్యాచారం చర్చకు రాలేదు. ఆమె ఉరి తీసుకున్న విషయం చర్చకు రాలేదు. వచ్చిన చర్చల్లా — నాగరాజా మీద ఆచారి— చెయ్యి చేసుకోవటం గురించి.

"చూడు ఆచారీ! నాగరాజా చేసింది తప్పో ఒప్పో మాకు తెలుసు. తప్పే అనుకో. దానికి శిక్షించే అధికారం నీ చేతుల్లో లేదు. పెద్దలం ఉన్నాం. పంచాయితీ ఉంది. ధర్మరాజు లాంటి నాయుడు గారు ఉన్నారు. మేం చేసేదేదో చేసేవాళ్ళం. ఆనవసరంగా నీ చేతులు నువ్వే కాల్చుకున్నావ్. నీ ఇంటికి నువ్వే నిప్పు పెట్టుకున్నావ్ జరిగిన విషయాన్ని చూచాయగా మా చెవిని వేసుంటే మేమే ఏదో తేల్చేవాళ్ళం"— అని పెదవి విరిచింది పంచాయితీ రూపంలోని న్యాయం.

పంచాయితీ ముగిసింది, సభ ముగిసింది, న్యాయం కళ్ళు మూసుకుని మౌనంగా రోదించింది. అన్యాయం ఆ చెట్టులానే విజృంభించి వికటాట్టహాసం చేసింది. ఆ అట్టహాసాల మధ్య జరిగిన నిర్ణయం ప్రకారం గుడిలో దేవుడికి సేవచేసే అవకాశాన్ని, అధికారాన్ని రామానుజాచారి కోల్పోయాడు. పెద్దలు



గారాబం —ఫోటో: ఎం. వి. వరప్రసాదరావు

అతని అర్చక పదవికే మంగళహారతి పాడారు. అప్పట్నుంచీ రామానుజాచారికి ప్రకృతే ఇల్లు. అతని పసిపాపకి ప్రకృతే ఊయల. అందరికీ హక్కున్న ప్రకృతి రామానుజాచారికి అన్నీ తానే అయింది.

* * *

చిటపట చినుకులు ప్రారంభమై నిశ్చలంగా పడి, ఆలోచనా లోకాల్లో పయనిస్తున్న రామానుజాచారికి చైతన్యాన్ని కలిగించాయి. లేని సత్తువని తెచ్చుకొని లేచాడు. దూరాన దేవుడి ముందు వెలిగే దీపాల కాంతులు, బ్యాండు మేళం చేసే రొద... సాగిన పోయాడు. ఒక్కొక్క అడుక్కీ చినుకుల పరిమాణంలో పరిణామం పెరిగి క్రమంగా వానగా మారి ఉద్ధృతంగా కురవసాగింది.

* * *

అంతవరకూ రథాన్ని నోపిగ్గా 'భక్తి పగ్గాల'తో లాగిన భక్తులు వర్షం మొదలవగానే ఎవరిమట్టుకు వాళ్ళు భద్రత కోసం నడి బజార్లోని చెరో అరుగు మీదికీ చేరుకున్నారు. రాని వాళ్ళ కోసం అయిన వాళ్ళు కంగారు పడుతున్నారు. నాయుడుగారి భార్య భారీ శరీరాన్ని కదపలేక కదుపుతూ'రోడ్ రోలర్'గా నడుస్తూ వస్తోంది. ముందుగానే భద్రంగా ఒక అరుగుమీదికి చేరుకున్న నాయుడు గారు 'తొందరగా రమ్మని' భార్యని కేక వేస్తున్నారు. 'రొంప చేస్తుంద'ని హెచ్చరిస్తున్నారు. నాయుడుగారి కుక్క ఆయన కాళ్ళ మధ్య తలదాచుకోవటానికి ప్రయత్నం చేస్తోంది. అరుగు మనుష్షుల్ని సముదాయించలేక పోతూంది. నోవర్‌లోడ్ బస్‌లా ఉంది. అక్కడ ఎవరి భద్రత వారిదే! 'నాయుడు గా'రంటూ ప్రత్యేక స్థానం లేదు. చూరులోంచి కారే వర్షం నీటితో తడిసి పోతున్న నాయుడు గారు పడబోయి నిలద్రొక్కుకున్నారు. కేక వేయటానికి ఆయనకు ధైర్యం చాలటం లేదు. భక్తులూ, అర్చకులూ, అరుగుల మీదికి చేరుకుని రోడ్డు మధ్య వర్షంలో అందంగా తడిసే రథాన్ని చూస్తున్నారు. రథానికి చలనం లేదు. రథానికి చేసిన అలంకరణలు తడిసి ఒక్కొక్కటే గాలికి ఎగిరి పడిపోతున్నాయి. మోడువారిన చెట్టులా రథం, చెట్టు తొర్రలోని పక్షిలా దేవుడు. వారికి రక్షణ లేదు. ఎవరి రక్షణ, ఎవరి సుఖం వారు చూసుకుంటూ వర్షం తెచ్చే చిరుజల్లుల గాలుల్లో అదో రకం అనుభూతికి లోనై రథం మాటే మరచిపోయారు. రథంలోని దేవుణ్ణే మరచిపోయారు.

వర్షం విజృంభించి కురుస్తోంది. వర్షంలో రామానుజాచారి తడుస్తూ పరుగెత్తుకొస్తున్నాడు. వెనుక నుండి అతడి మీద పడ్డ కాంతి అతన్ని దాటుకుంటూ వస్తోంది. అతను పందు తిరిగాడు కాంతి తిరిగింది. ఆ కాంతిలో అతడు గమనించింది రథాన్ని, అందుల ఆచ్ఛాదన లేకుండా కనపడే దేవుణ్ణి.

అతని వెనకాల ముందు చూపుతో వచ్చే భారీ వాహనం, భారంగా ముందు చూపు లేకుండా వర్షాన్ని చీల్చుకుంటూ శబ్దం చేస్తోంది.

"స్వామీ! గోపాలా! లారీ వస్తోంది. పక్కకి వెళ్ళు స్వామీ! గోపాలా!" రామానుజాచారి హెచ్చరిక విన్నదేవుడు తనకి తానై ప్రక్కకు తప్పుకోలేదు. ఆ ప్రయత్నమూ చేయలేదు. స్వామిని మోసే రథమూ కదలలేదు. వస్తున్న లారీని డ్రైవ్ చేస్తున్న వ్యక్తికి 'డోస్' ఎక్కువైందనీ గానీ, అతను అనాలోచితంగా డ్రైవ్ చేస్తూ బ్రేకు వేసినా ఆ బ్రేకులు తమ కర్తవ్యాన్ని తాము నిర్వహించే స్థితిలో లేవు గానీ ఆ ప్రజలకూ తెలీదు. ఆదేవుడికీ తెలీదు.

"ఏమండీ... బాబూ...నాయుడు గారు...లారీ... రథం... స్వామీ!" రామానుజాచారి ఆ రథం వేపు పరుగెడుతూ కేక వేస్తున్నాడు. అతని కేకలు వర్షం జోరులో గాలి హోరులో అతని వద్దకే తిరిగొచ్చి పడిపోయాయి.

"పిచ్చివాడు..." కొన్ని కంఠాలు జాలిగా నొచ్చుకుంటున్నాయి.

లారీ వచ్చేసింది. దాని వేగంలో మార్పులేదు. అది చేసే రొదలో మార్పులేదు.

"స్వామీ! రథాన్ని రెండు చేతుల్తోను కావలించుకున్న అతని కేక గాలిలో తేలిపోయింది. రథం పక్కనున్న పల్లంలోకి దొర్లి నో స్తంభానికి గుద్దేసి ఆగిపోయింది. వర్షం నీటితో బాటు రామానుజం రక్తాన్ని కూడా చిమ్ముకుంటూ గమ్యాన్ని చేరటానికి వేగాన్ని పెంచుకుంటూ లారీ సాగిపోయింది.

వర్షం నీటిలో కలిసిన రామానుజం రక్తం చల్లగా ప్రవహిస్తోంది.

తనని అంతరంగికంగా చేసుకున్న రామానుజం భవులేని నిర్జీవ శరీరాన్ని తదేకంగా చూస్తున్నట్లుగా రథంలోని దేవుడు చూస్తున్నాడు ఆత్మసాక్షాత్కారం పొంది నిర్వికారంగా దేవుణ్ణే దర్శిస్తున్నట్టు రామానుజాచారి కళ్ళు నిశ్చలంగా తెరచి చూస్తున్నాయి.

వర్షం ఆగలేదు.

భక్తులు అరుగులు దిగలేదు.

సుదూరాన రామానుజాచారి గుడిసెలో ఉయ్యాల్లోని రెండేళ్ళ పసిపాప వర్షంలో శృతి కలిపి ఏడుపు ఆగలేదు.

*